క్లుప్తంగా

కొనసాగుతున్న మైసమ్మ జాతర


పూజలో భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మైసమ్మ దేవత వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు మంగళవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయంలో శతచండీ హోమం, పూజలు, విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కల్వకుర్తి నియోజక వర్గ డీఎస్పీ ఇంచార్జి రమేశ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం, అర్హతను బట్టి ఉపాధి కల్పించాలని, అర్హులైన పేద రైతులకు ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలని, అర్హులైన వారికి 200 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, యాదగిరి, హరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్ బుక్‌ల పంపిణీ


యడవల్లిలో పాస్ బుక్‌లు పంపిణీ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలు, సీసీలు

తలకొండపల్లి: పొదుపు సంఘం మహిళలు మంగళవారం మహిళా శక్తి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చుక్కాపూర్, యడవల్లి, తలకొండపల్లి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పొదుపు సంఘం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. పొదుపు సంఘంలో చేరితే లాభాల గురించి అవగాహన కల్పించారు. నేటి నుంచి డిసెంబర్ 9 వరకు చేరిక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు పొదుపు సంఘంలో చేరారు. పొదుపు సంఘంలో చేరిన మహిళలకు వ్యక్తిగత పాస్ బుక్‌లు పంపిణీ చేశారు. ప్రతీనెల క్రమం తప్పకుండా పొదుపు డబ్బులు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు విజయలక్ష్మీ, రాములు, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

ఎంఈఓ రాందాస్


బీసీ గురుకుల పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఈఓ రాందాస్

మంచాల: విద్యార్థులకు సమయానుకూలంగా పోషకాహారం అందించాలని మంచాల ఎంఈఓ రాందాస్ పేర్కొన్నారు. మంగళవారం నోముల గ్రామ పరిధిలోని మహాత్మజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్‌ను విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. త్రాగు నీటిని వేడి చేసి ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంలు విద్యార్థుల ఆరోగ్య విషయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం!

సాగర్ హైవేపై పొంచి ఉన్న ప్రమాదం

- అధ్వానంగా మాల్, యాచారం కేంద్రాల్లోని సీసీ రోడ్డు
- శిథిలావస్థకు చేరిన తక్కళ్లపల్లి కల్వర్టు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


తక్కళ్లపల్లి గేట్ వద్ద కల్వర్టుపై దెబ్బతిన్న సిమెంట్ దిమ్మెలు


సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై భయం.. భయంగా ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ఎటునుంచి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సాగర్ రహదారిపై నిత్యం వేలాది మంది ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. తరుచూ ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు ఈ రహదారిగుండా ప్రయాణిస్తున్నారు. తక్కళ్లపల్లి గేట్ వద్ద ఏళ్ల కింద నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీన్ని మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ కల్వర్టుపై ఎన్నో వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డుకిరువైపులా నిర్మించిన సిమెంట్ కంచె పూర్తిగా ధ్వంసమైంది. రెండేళ్లుగా ఎన్నో వాహనాలు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టాయి. ఇంత జరుగుతున్న రోడ్డు భవనాల శాఖ అధికారులకు మరమ్మతులు చేయించాలనే ధ్యాస లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది.

గుంతలతో గుబులు

సాగర్ హైవేపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. పదేళ్ల కిందట ఈ రహదారిని విస్తరణ చేసే సమయంలో యాచారం, మాల్ కేంద్రాల్లో సీసీరోడ్డు నిర్మించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ రోడ్డు నిర్మించడంతో 15 ఏళ్ల పాటు చెక్కుచెదరదని రోడ్డు భవనాల శాఖ అధికారులు పేర్కొన్నారు. కానీ యాచారం, మాల్ కేంద్రాల్లోని సీసీ రోడ్డుపై పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ఏర్పడిన ఈ గుంతలతో వాహనాదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై గుంతలు ఉండడంతో అతి వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

తరుచూ ప్రమాదాలు

సాగర్‌రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా మారింది. సాగర్‌రోడ్డుపై ఇరుపక్కల వెంచర్లు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు ఇష్టానుసారంగా రోడ్డును ఆక్రమిస్తున్నారు. ప్రమాదాలు జరిగే చోట్ల సాగర్‌రోడ్డుకు లింకు కలిపి వెంచర్లు, ఫాంహౌజుల రోడ్లకు లింకులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలు చోట్ల వ్యాపారులు ఈ కంచెను తొలగింగి తమకు అనుకూలంగా కలిపేస్తున్నారు. తమ్మలోనిగూడ గేట్, చింతపట్ల గేట్, నక్కగుట్ట తండా, పోలీస్ స్టేషన్ సమీపంలోని ఫంక్షన్ హాల్ వద్ద, గునుగల్ క్రీడా క్షేత్రం, ఆగాపల్లి గేట్, గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగే చోట్ల కనీస హెచ్చరికబోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయంలో రోడ్డు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కల్వర్టు పనులు చేయాలి



సాగర్‌రోడ్డుపై తక్కళ్లపల్లి గేట్ వద్ద ప్రమాదకరంగా మారిన కల్వర్టును మరమ్మతులు చేయాలి. ఏళ్ల కింద నిర్మించిన సిమెంట్ దిమ్మెలు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. రోడ్డుకిరువైపులా దిమ్మెలు ఊడిపోయాయి. ఈ రోడ్డుగుండా ప్రయాణించాలంటే భయంగా ఉంటుంది.

– లక్ష్మీపతిగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, చింతపట్ల

ప్రమాదాలు సంభవిస్తున్నాయి



సాగర్‌రోడ్డుపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై వెలుతుంటే వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి అతి వేగంగా వెళ్లే వాహనాలు గుంతలను గమనించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ గుంతల వల్ల పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– పాశ్శ బాషా, మాజీ సర్పంచ్, నక్కర్తమేడిపల్లి

మరమ్మతులు చేపడుతాం

సాగర్‌రోడ్డుపై యాచారం, మాల్ కేంద్రాల్లోని సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయిస్తాం. తక్కళ్లపల్లి గేట్ వద్ద శిథిలావస్థకు చేరిన కల్వర్టు దిమ్మెలను పరిశీలించి, కొత్త దిమ్మెలు ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా. అత్యవసరమైన చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– వినోద్ కుమార్, ఏఈ యాచారం, రోడ్డు భవనాల శాఖ

సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం నుంచి నిర్వహించనున్న కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కానుగుల దశరథం పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారన్నారు.

దశల వారీగా అభివృద్ధి

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి


పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొంగరకలాన్‌లోని ఏడో వార్డులో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదిబట్ల మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఇప్పటికే ఆదిబట్లలోని 15 వార్డుల్లో సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు వేయిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే ఆదిబట్లను అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కౌన్సిలర్ నీళ్ల హరిదాసు గౌడ్, శ్రీకాంత్, చిత్తపురం యాదయ్య, చిలుకల రవీందర్, బాలరాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్, తదితరులు

మండల కేంద్రంగా ప్రకటించాలి

బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తునప్పటికీ సంబంధిత అధికారులు, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మంగళవారం గట్టుఇప్పలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య మాట్లాడారు. గ్రామంలో సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని, ఈ విషయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏదుల రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ శిరీష, కృష్ణయ్య, శరత్‌చంద్ర, రవీందర్, నర్సింహ, పురుషోత్తం, విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

నియోజకవర్గంలోని పలు మండల కేంద్రాల్లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు భారత దేశ మాజీ ప్రధాని, ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దేశానికి ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.


ఆమనగల్లు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


తలకొండపల్లి: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కడ్తాల్: నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


తుర్కయంజాల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


మంచాల: విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి

ఆమనగల్లు: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని, ప్రజలందరూ వినియోగించాలని ఆమనగల్లు ఎంపీడీఓ కుసుమమాధురి సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్‌కార్యాలయ సమావేశపు హాల్లో మంగళవారం హమారా శౌచాలయ్..హమారా సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అలాగే వరల్డ్ టాయిలెట్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమ మాధురి మాట్లాడారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్‌కు సహకరించాలని ఆమె కోరారు. కొన్ని గిరిజన తండాల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదన్నారు. ఈ విషయంలో వారికి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రసన్న, ఐకేపీ ఏపీఎం మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీడీఓ మాధురి

యాచారంలో..

యాచారం: ప్రతీ ఇంటికి తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో ప్రజలు చైతన్యం కావాలని యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా నస్దిక్‌సింగారం గ్రామంలో పలువురి ఇళ్ల వద్ద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటేనే ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


యాచారం: మరుగుదొడ్డి నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి


తుర్కయంజాల్: షీ టాయిలెట్ ప్రారంభిస్తున్న అనురాధ తదితరులు

ఆత్మగౌరవమే లక్ష్యం: మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటమే లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తెలిపారు. వరల్డ్ టాయిలెట్ డే పురస్కరించుకుని మునగనూర్‌లో షీ టాయిలెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కే.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఏబీవీపీ మండల కన్వీనర్ దండు కార్తీక్ గౌడ్

మాడ్గుల: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ దండు కార్తీక్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా పాలకుల విధానాలు మారడం లేదన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాలు రూ.7,500 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ పది నెలలు అవుతున్నా ఇంతవరకు విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సకాలంలో నిధులు అందకపోవడంతో విద్యార్థులు పైతరగతులకు వెళ్ల లేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

పేదల కోసమే ఐక్యత సేవలు

సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: పేదల కోసమే ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజలందరికీ విద్య, ఉపాధి, వైద్యం అందించడానికి ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో మంగళవారం శంకర నేత్రాలయ సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు నిర్వహించనున్న మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ప్రజా సేవ కోసమే ఈ ఫౌండేషన్ ఆవిర్భవించిందన్నారు. ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నాలుగేళ్లుగా కల్వకుర్తి నియోజక వర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో మొదటిరోజు 430 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 220 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 26 మందికి కంటి ఆపరేషన్లు చేయడానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, మల్లయ్య, రమేశ్‌గౌడ్, కొండల్‌యాదవ్, కొండల్ రెడ్డి, రఘు, యాదయ్య, శేఖర్, రమేశ్‌నాయక్, అభినవ్‌రెడ్డి, శ్రీను, మహేశ్, శంకర్ నేత్రాలయ వైద్యులు రాజు, భాను, మహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

అంతర్జాతీయ మెన్స్ దినోత్సవం


ఇబ్రహీంపట్నం: కేక్ కట్ చేస్తున్న పరమేశ్


ఆమనగల్లు: కేక్ కట్‌చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ మెన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఇబ్రహీంపట్నంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడారు. సమాజంలో ఉన్న పురుషులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మహేశ్, హరిప్రసాద్, ఐలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, అవినాష్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమమాధురి, సిబ్బంది మాధవరెడ్డి, కుమార్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.